ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
ఆదివారం 15 డిసెంబరు 2024

## వారంలోగా బీజేపీ సిరిసిల్ల పట్టణ కమిటీ ఎన్నిక

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణ బీజేపీ కమిటీ ఎన్నికలను వారంలో నిర్వహిస్తామని, అప్పటివరకు పట్టణంలోని బూత్ అధ్యక్షులను ఎన్నుకోవాలని ఎన్నికల అధికారి కొక్కు దేవేందర్‌యాదవ్ కోరారు. సిరిసిల్ల పట్టణం శివనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం బీజేపీ పట్టణ కమిటీ సమావేశం పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి దేవేందర్‌యాదవ్ మాట్లాడుతూ బీజేపీ భవిష్యత్ ప్రణాళికల కోసం ముందుగా బూత్‌కమిటీ అధ్యక్షులను ఎన్నుకున్న తర్వాతనే పట్టణ కమిటీ ఎన్నిక చేపడుతున్నామన్నారు.

## న్యూస్ బాక్స్

### రాజూరి సద్గుణాచారికి ఉత్తమ జ్యోతిష్య శిరోమణి బిరుదు

ముస్తాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గూడెంకు చెందిన వాస్తు జ్యోతిష్య పురోహితుడు, విశ్వ బ్రాహ్మణ పురోహిత సంఘం జిల్లా అధ్యక్షుడు రాజూరి సద్గుణాచారికి ఉత్తమ శిరోమణి బిరుదు అందుకున్నారు. శనివారం ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో మహతి ఆడిటోరియంలో ఎస్ఎస్‌లైవ్ ఆస్ట్రో ప్రైవేటు లిమిటెడ్ సంస్థ సభ్యులు సన్మానించారు. జ్యోతిష్య పండితుడు వీపీ రంగాచార్యులు తెలంగాణ విశ్వబ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమూర్తి అచార్యులు, బ్రహ్మశ్రీ కాసర్ల మనోహర్ శాస్త్రీ, డాక్టర్ మహేశ్ స్వామి, డాక్టర్ రాజేశ్వర్ రెడ్డి ఉన్నారు.

### ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా బాలయ్య

తంగళ్లపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలో శనివారం మండల ఎమ్మార్పీఎస్ పాలక వర్గాన్ని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సావనపల్లి బాలయ్యతో పాటు పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు.

### నేడు గురు పాదుకపూజ

గంభీరావుపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం లింగన్నపేట హరిహర దేవాలయంలో ఆది వారం సాయంత్రం భారతి తీర్థస్వామి పాదుక పూజ నిర్వహించనున్నట్లు వేద పండితులు రామశర్మ, రాధకృష్ణశర్మ, దేశపతి సుదర్శన శర్మ తెలిపారు. ఊరేగింపు, అన్నదాన ఉంటాయని పేర్కొన్నారు.

# పెరిగిన చలి



సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పొగ మంచు

**శనివారం జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు**

| మండలం | ఉష్ణోగ్రత |
|---|---|
| రుద్రంగి | 10.6 |
| గంభీరావుపేట | 10.6 |
| బోయినపల్లి | 15.5 |
| వీర్నపల్లి | 11.9 |
| వేములవాడ రూరల్ | 12.6 |
| కోనరావుపేట | 13.5 |
| వేములవాడ | 13.5 |
| ఇల్లంతకుంట | 13.6 |
| తంగళ్లపల్లి | 13.6 |
| సిరిసిల్ల | 14.4 |
| చందుర్తి | 15.4 |
| ఎల్లారెడ్డిపేట | 16.0 |

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. పొద్దంతా వణికిస్తోంది. నాలుగు రోజులుగా మళ్లీ కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. శనివారం జిల్లాను ఎల్లో అలర్ట్‌గా ప్రకటించారు. కనిష్ఠ ఉష్ణోగ్రత 10.6 డిగ్రీలుగా నమోదైంది. గరిష్ఠ ఉష్ణోగ్రత 31.1 డిగ్రీలుగా ఉంది. జిల్లాలో చలి తీవ్రతకు ఉదయం రాత్రి వేళల్లో జనం బయట తిరగడానికి ఇబ్బందులు పడుతున్నారు. వేకువ జామున పొగమంచుతో చిరువ్యాపారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ రోజు 10 డిగ్రీల నుంచి 11 వరకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

జిల్లా కేంద్రంలో ఉదయం వేళల్లో పొగమంచు కమ్మేస్తోంది. పొగమంచు చలితో సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని రైతు బజార్‌లో రైతులు ఇబ్బందులు పడుతూనే వ్యాపారాలు సాగిస్తున్నారు. చలి తీవ్రతకు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఉష్ణోగ్రతలు మరింత పడిపోతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఉదయం రాత్రి వేళల్లో కాకుండా పగటి ఉష్ణోగ్రతలు కూడా తగ్గిపోతున్నాయి. మరోవైపు చలి తీవ్రత నేపథ్యంలో అస్తమా, ఇతర శ్వాస కోసం వ్యాధులు ఉన్నవారితో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నావారు జాగ్రత్త వహించాలని వైద్యులు సూచిస్తున్నారు. చలి జ్వరాలు, నరాలకు సంబంధించిన ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొంటున్నారు.

### ఇళ్లలోనే జనం

జిల్లాలో రోజురోజుకు చలి తీవ్రత పెరగడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో జనం ఇళ్లలోనే ఉంటున్నారు. ఉదయం 10 గంటల వరకు బయటకు రావడం లేదు. రాత్రి వేళల్లో కూడా త్వరగా ఇంటికి చేరుకుంటున్నారు. చలికి ఎక్కువగా భయపడుతున్నారు. వృద్ధులు పూర్తిగా ఇళ్లకే పరిమితం అయ్యారు. చలి తీవ్రత పెరగడంతో స్వెట్లర్లు, మఫ్లర్ల గిరాకీ పెరిగింది. జిల్లా కేంద్రంతో పాటు వేములవాడ పట్టణం, మండల కేంద్రాల్లో స్వెటర్ల అమ్మకాలు పెరిగాయి.

### మందగించిన వ్యాపారాలు

చలి తీవ్రతతో చిరు వ్యాపారాలు మందగించాయి. జనాలు ఇళ్లలో నుంచి బయటకు తక్కువగా వస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో దుకాణాలు వెలవెలబోతున్నాయి. కూరగాయలు, పాల వ్యాపారులు ఉదయం చలి తీవ్రతలోనే ఇబ్బందులు పడుతూ వ్యాపారాలు చేస్తున్నారు. ఉదయం వేళల్లో రోజు పొగ మంచు ఉండడంతో ఇబ్బంది పడుతున్నారు.

### ఆరోగ్యం.. జర భద్రం

చలి తీవ్రత నేపథ్యంలో ఆర్యోగంపై జాగ్రత్తగా ఉండాలని

మిగతా 8వ పేజీలో

## క్రమశిక్షణతో కష్టపడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో కష్టపడితేనే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని, పోలీస్‌శాఖలో ఆర్మెడ్ రిజర్వ్ విభాగం పాత్రకీలకమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం జిల్లా ఆర్మెడ్ రిజర్వ్ హెడ్ క్వార్టర్స్‌ను ఎస్పీ వార్షిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో కష్టపడితేనే జీవితంలో ఉన్నత స్థానంలో ఉంటారన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఆర్మెడ్ రిజర్వ్ సిబ్బంది సివిల్ పోలీసులకు సహాయంగా శాంతిభద్రతల పరిరక్షణలో విధులు నిర్వహిస్తారన్నారు. శారీరకంగా, మానసికంగా ధ్రుడంగా ఉండేందుకు నిత్య జీవితంలో యోగా, వ్యాయామం ఒక భాగంగా చేసుకోవాలన్నారు. అంతకుముందు ఎస్పీ ఆర్మెడ్ రిజర్వ్ పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్మెడ్ రిజర్వ్ హెడ్‌క్వార్టర్స్, ఆర్ఐ అడ్మిన్ కార్యాలయం, ఆర్ఐ హోంగార్డ్, రికార్డులు, బీడీ టీమ్, డాగ్ స్క్వాడ్, ఆర్ఐ ఎంటీవో కార్యాలయాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్ఐలు మధుకర్, రమేశ్, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

## నేడు మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం

చందుర్తి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం నర్సింగాపూర్‌లోని మోహినికుంట లక్ష్మీమల్లికార్జునస్వామి ఆలయం స్వామి వారి కలాణోత్సవానికి ముస్తాబైంది. క్రోధినామ సంవత్స మార్గశిర శుద్ధ పౌర్ణమి ఆదివారం ఉదయం 11-55నిమిషాలకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకోనున్నారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ వంశపారం పర్య అర్చకుడు భద్రయ్య శర్మ తెలిపారు.

## తాగునీరు కలుషితం


కలుషితమైన నీరు

వీర్నపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ నిర్వహణలో నిర్లక్ష్యంతో తాగునీరు కలుషితమవుతోంది. వీర్నపల్లి మండలకేంద్రంలోని మంచినీటి ట్యాంకులో కలుషిత నీరు నింపుతుండడంతో ఆ నీటిని తాగేందుకు ప్రజలు భయపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో తాగునీటి కోసం ప్రైవేటు వాటర్ ప్లాంట్లపై ప్రజలు ఆధారపడాల్సిన పరిస్థితి. తాగునీరు కొనుగోలు చేసి వినియోగించుకోవడం పేదలకు భారంగా మారింది.

## రాజన్న ఆలయం భక్తజన సంద్రం

- ప్రత్యేక పూజల్లో భక్తులు
- కోడె మొక్కు చెల్లింపు


స్వామివారి దర్శనం కోసం క్యూలో భక్తులు

7

## తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్
- కామన్ డైట్ మెనూ ప్రారంభం


పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

8

# గ్రూప్-2 పరీక్షకు సర్వం సిద్ధం

**- 26 కేంద్రాల్లో ఏర్పాట్లు - నేడు, రేపు పరీక్షలు**

సిరిసిల్ల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఆది, సోమవారాల్లో రెండు రోజులపాటు నిర్వహించే నాలుగు పరీక్షల సందర్భంగా అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. జిల్లాలో గ్రూప్-2 పరీక్ష కోసం 26 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 7163 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో 106 మంది దివ్యాంగ అభ్యర్థులు ఉన్నారు. పరీక్షల నిర్వహణకు ఇన్విజిలేటర్లతోపాటు 26 మంది పరిశీలకులు, 26 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 26 మంది సూపరింటెండెంట్‌లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఉన్నా జిరాక్స్ సెంటర్‌లు, ఇంటర్‌నెట్ సెంటర్‌లను మూసివేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, అభరణాలు అనుమతించరు. చెప్పులతోనే రావాల్సి ఉంటుంది. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లకు భద్రపర్చుకోవడానికి లాకర్‌రూం సౌకర్యం ఉండదు. అభ్యర్థులే ఏర్పాట్లు చేసుకోవాలి. పరీక్షలు మొదటి పరీక్ష ఉదయం 10. గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వవరకు రెండో పరీక్ష మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగుతుంది. పరీక్షకు అరగంట ముందే గేట్లు మూసివేస్తారు. అభ్యర్థులు కనీసం గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. బయోమెట్రిక్ విధానం అమల్లో ఉంటుంది.

## స్వయం పాలన దినోత్సవం

**- విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ**

ముస్తాబాద్, డిసెంబర్ 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మహర్షి ఇంగ్లీష్ మీడియంలో శనివారం విద్యార్థులు ఉపాధ్యాయులు మారారు. పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ జలజ, హెచ్‌ఎం ఉత్పలమాల, కరస్పాండెంట్ సుధ, ఉపాధ్యాయులు మోహన్, చర్ల శ్రీనువాస్, స్రవంతి, అనూష, శిరీష విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


అవార్డు కాపీ అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత

# రాజీయే రాజమార్గం

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత**

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజీయే రాజమార్గమని జిల్లా లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత అన్నారు. సిరిసిల్ల జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా జిల్లా లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 10 బెంచ్‌ల ద్వారా 7,295 కేసులు పరిష్కరించి రూ 1,45,42,230 చెల్లింపులు జరిగాయన్నారు. ఇందులో పీడీజే 5, 1వ అడిషనల్ కోర్టుల్లో 3, సీనియర్ సివిల్ కోర్టులో 1, ప్రిన్సిపల్ జూనియర్‌సివిల్ కోర్టులో 75, 1వ అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టులో 80, 2వ అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టులో 84, వేములవాడ జూనియర్ సివిల్ కోర్టులో 748, సెకండ్ క్లాస్ కోర్టులో 1202, డిఎల్ఎస్ఏలో బ్యాంకు పీఎల్‌సీలు 84, బీఎస్ఎన్ఎల్ పీఎల్‌సీలు 9, ట్రాఫిక్ పీఎల్‌సీలు 5003 కేసులు పరిష్కారం అయ్యాయన్నారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమమన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ ద్వారా ఉచిత న్యాయసేవలను ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి పోలీస్, ఎక్సైజ్‌శాఖల ఎస్‌హెచ్‌వోలు, కోర్టు కానిస్టేబుల్స్ ప్రత్యేక చొరవచూపారన్నారు. ఇందులో ప్రధానంగా భార్యభర్తల మధ్య ఉన్న కేసుల్లో రాజీ ఏర్పడడంతో పలువురు దంపతులకు అవార్డు కాపీ ఇచ్చి అభినందించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్, సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మణాచారి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్, అదనపు జూనియర్ సివిల్‌జడ్జి సృజన, సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దోర్నాల సంజీవరెడ్డి, కార్యదర్శి వెంకటి, లోక్ అదాలత్ సభ్యుడు చింతోజు భాస్కర్, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

**వేములవాడ:** వేములవాడ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జ్ జ్యోతిర్మయి 690 కేసులకు సంబంధించి కక్షిదారుల మధ్య రాజీ కుదిర్చి కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి జ్యోతిర్మయి మాట్లాడుతూ ఏళ్ల తరబడి వివిధ కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులకు గురవుతున్న కక్షిదారులు లోక్ అదాలత్ ను ఉపయోగించుకోవాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం మాట్లాడుతూ రాజీపడదగిన క్రిమినల్ సివిల్ కేసులు, బ్యాంకు కేసులు, కుటుంబ వివాదాలు, చెక్ బౌన్స్ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించినట్లు తెలిపారు. ఏజీపీ పుప్పాల భానుకృష్ణ, లోక్ అదాలత్ సభ్యులు నాగుల సత్యనారాయణ, నక్క దివాకర్, న్యాయ వాదులు పిట్టల మనోహర్, గొంటి శంకర్, బొడ్డు ప్రశాంత్ కుమార్, బొడ్డు గంగరాజు, నర్సింగరావు, బొజ్జ నరేష్, నాగేంద్రబాబు పాల్గొన్నారు.



వేములవాడలో మాట్లాడుతున్న న్యాయమూర్తి జ్యోతిర్మయి

## కన్నుల పండువగా మహాలింగార్చన


ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శివాలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం పురోహితులు వేద పఠనం, హవనం, మహాలింగార్చనను కన్నుల పండువగా నిర్వహించారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, వివిధ పార్టీల నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 15న యంత్ర, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, కుంబాభిషేకం, శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌లోని లబ్ధిదారుడు తిరుపతిరెడ్డికి మంజూరైన రూ.16 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును స్థానిక కాంగ్రెస్ నాయకులు శనివారం పంపిణీ చేశారు. పేదల వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలయ్య, రాజయ్య, సురేశ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# చదువుతోపాటు రచనపై దృష్టి సారించాలి

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతోనే విద్యార్థుల్లో జ్ఞానం పెంపొందుతుందని, విద్యార్థులు చదువుతోపాటు రచనలపై దృష్టి సారించాలని సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ దుబ్బాక లావణ్య కోరారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు శివారులోని రంగినేని చారిటబుల్ ట్రస్ట్‌లో శనివారం రేగులపాటి లక్ష్మీ బాల వికాస పురస్కారం ప్రదానోత్సవం, పిల్లల పండుగ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ లావణ్య ప్రముఖ రచయితలు మాడభూషి లలితాదేవి, మంజూనూరి కృష్ణకుమారి, స్వరాజ్యం రమణమ్మకు రేగులపాటి లక్ష్మీ బాల వికాస పురస్కారాలను ప్రదానం చేశారు. అనంతరం కథల తోటల చిలుకల బండి, బడి బువ్వ, చందమామరావే పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ పిల్లలు ప్రతీనిత్యం పుస్తక పఠనం చేయడంతోపాటు పరిసరాలను నిత్యం గమనిస్తూ ఉండాలన్నారు. పుస్తకాలను చదివినప్పుడే సమాజంలో జరుగుతున్న సంఘటనలు, సమస్యలను తెలుస్తాయని, పరిష్కరించే విధంగా ఎలా జీవించాలో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు తూడి వెంకటరావు, రంగినేని సుజాతమోహన్‌రావు, డాక్టర్ మహేష్‌రావు, గరిపెల్లి అశోక్, డాక్టర్ పత్తిపాక మోహన్, మద్దికుంట లక్ష్మణ్, జూకంటి జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ లావణ్య


విద్యార్థులతో భోజనం చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

# గురుకులాలపై ప్రత్యేక దృష్టి

**● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

వేములవాడ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గురుకుల పాఠశాలలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల చర్యలను తీసుకుంటోందని ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ స్కూల్ (గర్ల్స్, మానాల)లో కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంట గది, వంటకు ఉపయోగించే బియ్యం, కూరగాయలు, ఇతర పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఆయన వారితో కాసేపు సరదాగా నృత్యం చేశారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం సంవత్సర కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల విద్యార్థులకు బలవర్ధకమైన రుచికరమైన ఆహారాన్ని అందించే లక్ష్యంతో కామన్ డైట్ మెనూ కార్యక్రమం అమలు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు గురుకులాలను సందర్శిస్తున్నారని తెలిపారు. గురుకులాల్లో చదువుతున్న 8 లక్షల మంది విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం అందించాలని, నిపుణులైన డాక్టర్‌ల సమక్షంలో డైట్ మెనూ ఏర్పాటు రూపొందించామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక పండుగ వాతావరణంలో నేడు ఈ కార్యక్రమం ప్రారంభించుకున్నామన్నారు. పదేళ్లుగా రాష్ట్రంలో విద్యా వ్యవస్థ నిర్వీర్యమైందని, ప్రజా ప్రభుత్వంలో విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యమైన విద్యను రుచికరమైన భోజనాన్ని అందజేస్తున్నామని అన్నారు. ఉపాధ్యాయులు పిల్లల్లో దాగిన ప్రతిభను గుర్తించాలని, వారిని ఉన్నత శిఖరాలు అధిరోహించేలా ప్రోత్సాహం అందించాలని సూచించారు. 15 మంది విద్యార్థులను ఒక గ్రూపుగా తీసుకొని సబ్జెక్టుల వారీగా రివ్యూలు నిర్వహించాలన్నారు. ఐటీఐలను ఇప్పటికే ఏటీసీలుగా అప్‌డేట్ చేసినట్లు, త్వరలోనే 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. రుద్రంగి మండల కేంద్రంలోనూ ఏటీసీని సాధించుకున్నామని, ఏటీసీల్లో చదివిన విద్యార్థులకు స్కిల్స్ పెంపొందించడంతోపాటు ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉంటాయని అన్నారు. గురుకులాల్లోని వంట గది, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులను పట్టించుకోకుండా బాధ్యతారహితంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా విద్యాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించామని, పుస్తకాలు, యూనిఫామ్ సమయానికి అందిస్తున్నామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషితో గురుకులాల్లో 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మెటిక్ చార్జీలు పెంచామని అన్నారు. గురుకులాల విద్యార్థులు రాబోయే కాలంలో ఆరోగ్యంగా ఉంటూ మానసికంగా బలంగా ఉంటూ తెలంగాణ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### శాంతిభద్రతలకు ఆటంకం.. ఇద్దరి అరెస్టు

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు ఆటంకం కలిగించిన గంభీరావుపేట మండలంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ కి చెందిన శివరాత్రి లక్ష్మణ్, చల్ల సతీష్‌ను శనివారం అరెస్ట్ చేసినట్లు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. నవంబరు 24న చల్ల రమేశ్ అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ప్రమాదానికి కారణమైన వారి నుంచి పరిహారం ఇప్పించాలని అదేరోజు సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద రహదారిపై రాస్తారోకోతో ప్రజలకు ఇబ్బందులు కల్పించిన చల్ల బాలరాజు, చల్ల సతీష్, శివరాత్రి లక్ష్మన్, శివరాత్రి నరసవ్వ, శివరాత్రి భాగ్య శివరాత్రి సంతోష్, సంపంగి మల్లవ్వ, కొమ్మురాజు ఐలయ్యతోపాటు మరికొంతమందిపై కేసు నమోదు చేశారు. వారిలో ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. ప్రజలకు ఏదైనా సమస్య ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేయాలని డీఎస్పీ తెలిపారు. విచారణ జరిపి చట్ట పరమైన చర్యలు తీసుకుంటా మన్నారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని రోడ్ల మీదకు వచ్చి సామాన్య ప్రజలకు, శాంతి భద్రతలకు ఇబ్బందులు కలిగించేవారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

### చికిత్సపొందుతూ వ్యక్తి మృతి


గొల్లపల్లి మధు(ఫైల్)

రామగిరి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పన్నూరు గ్రామానికి చెందిన గొల్లపల్లి మధు(42) గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వివాహమై సంవత్సరాలు గడుస్తున్నా సంతానం లేదనే బాధతో మానసికంగా కుంగిపోయిన మధు తాగుడుకు బానిసయ్యాడు. బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో గడ్డిమందు తాగి ఆపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి తరలించగా వైద్యుల సలహా మేరకు కరీంనగర్‌కు, అక్కడినుంచి వరంగల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడు మధు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రకుమార్ తెలిపారు.

### బైక్ ఢీకొని బాలికకు తీవ్ర గాయాలు

గన్నేరువరం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలారం గ్రామంలో బైక్ ఢీకొని బాలిక(4)కు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని ఖాసింపేట గ్రామానికి చెందిన బొజ్జ మహేందర్, శిరీష దంపతుల కూతురు బొజ్జ దీక్ష(4) తమ అమ్మమ్మ ఊరైన మైలారం గ్రామానికి తన తల్లితో కలిసి శనివారం ఉదయం వెళ్లింది. మధ్యాహ్నం అమ్మమ్మ ఇంటికి సమీపంలోని కిరాణా షాపునకు వెళ్లి తిరిగి వస్తుండగా సాంబయ్యపల్లి గ్రామానికి చెందిన గడ్డం మహేందర్‌రెడ్డి బైక్‌పై వెళ్తూ బాలికను ఢీకొట్టాడు. దీంతో దీక్ష తలకు, ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబసభ్యులు, స్థానికులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

### రోడ్డు ప్రమాదంలో దంపతులు, బాలుడికి గాయాలు

ఎల్లారెడ్డిపేట డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో కామారెడ్డి సిరిసిల్ల ప్రధాన రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులతోపాటు చిన్నారికి గాయాలయ్యాయి. వీర్నపల్లి మండలం మద్దిమల్ల గ్రామానికి చెందిన దంపతులు బానోతు ప్రకాష్, కవిత వారి రెండేళ్ల కొడుకు శివతో ద్విచక్ర వాహనంపై సిరిసిల్ల వైపునకు వెళ్తున్నాడు. కామారెడ్డి వైపు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంగణంలోకి వెళ్తున్న క్రమంలో ఢీ కొన్నాయి. ప్రమాదంలో బానోతు ప్రకాష్, కవిత వారి రెండేళ్ల కొడుకు శివకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

### మెడికల్ కళాశాలకు వృద్ధురాలి పార్థివదేహం

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్)కు ఈశ్వరకృప వృద్ధాశ్రమం ప్రతినిధులు వృద్ధురాలి పార్థివదేహాన్ని దానం చేశారు. వీర్లపల్లిలోని ఈశ్వరకృప వృద్ధుల ఆశ్రమంలో 11నెలలుగా కంటిచూపు లేకుండా బాధపడుతున్న ఎన్నాడి లక్ష్మి(78) అనే వృద్ధురాలు శనివారం మృతి చెందింది. ఆశ్రమ నిర్వాహకుడు పీటీ స్వామి సిమ్స్ కళాశాలలోని అనాటమి డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కల్పనకు లక్ష్మి పార్థివదేహాన్ని అప్పగించారు. అనంతరం విద్యార్థులు, ప్రొఫెసర్లు మృతదేహానికి గౌరవ వందనం చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, సాన రామకృష్ణారెడ్డి, కేఎస్‌వాసు, చంద్రశేఖర్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మల్లికార్జున్, రాంచందర్‌రావు, వెంకటయ్య ఉన్నారు.

### విదేశాలకు పంపిస్తానని మోసం: వ్యక్తి అరెస్ట్

తంగళ్లపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విదేశాలకు పంపిస్తానని మోసగించిన తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామానికి చెందిన ఎండీ మహెబూబ్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం సిద్ధిపేట జిల్లా నారాయణరావుపేట మండలం మల్యాల గ్రామానికి చెందిన పెద్దపల్లి విజయ్‌కుమార్ అనే వ్యక్తిని విదేశాలకు పంపిస్తానని మోసగించి లక్ష రూపాయలు వసూలు చేసి తప్పుడు వీసాపై పంపించాడు. ఈ విషయంపై విజయ్‌కుమార్ తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మోసగించిన మోహబూబ్‌ను శనివారం అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

### వలస కార్మికుడి ఆత్మహత్య

జ్యోతినగర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన కార్మికుడు దీపక్ కుమార్‌యాదవ్(20) అనే వలస కార్మికుడు శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. తన ఇంటికి సమీపంలోని చెట్టుకు టవల్‌తో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. దీపక్‌కుమార్ ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అనారోగ్య కారణాలతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని కాలనీవాసులు అనుమానిస్తున్నారు. ఎన్టీపీసీ పోలీసులు ఆత్మహత్య ఘటనపై విచారణ చేపట్టారు. మృతుడి సంబంధీకులు ఎవరూ స్థానికంగా లేకపోవడంతో ఇప్పటివరకు పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

# ఊరి కోసం మన నేతలు



**గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా**
కోనరావుపేట మండల నేతలు తమదైన ముద్ర వేశారు. రాజకీయంగా కీలక పదవులు చేపట్టి ప్రజాప్రతినిధులుగా రాణిస్తూ సేవా కార్యక్రమాల్లో ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్నారు. - కోనరావుపేట

- రాజకీయాల్లో కీలక పదవులు
- సేవా కార్యక్రమాలతో ప్రత్యేక ముద్ర

■ రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నాగారంలో పుట్టి పెరిగిన చెన్నమనేని రాజేశ్వరరావు గతంలో కమ్యూనిస్టు ఉద్యమంలో కొనసాగారు. రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. సిరిసిల్ల నియోజకవర్గం నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. ఆయన కుమారుడు చెన్నమనేని రమేష్ బాబు జర్మనీకి చెందిన సేవ్స్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్‌గా ఉంటూ ఆ సంస్థ ద్వారా వేములవాడ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వాటర్ ప్లాంట్లు, వాటర్ ట్యాంకులు, పైపులైన్లు ఏర్పాటు చేయించారు. అనంతరం వేములవాడ నియోజకవర్గం నుంచి సుదీర్ఘకాలం ఎమ్మెల్యేగా పనిచేశారు.

■ ఇదే కుటుంబంలో దివంగత ఎమ్మెల్యే చెన్నమనేని రాజేశ్వరరావు తమ్ముడు చెన్నమనేని విద్యాసాగర్‌రావు బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా, కేంద్ర సహాయ మంత్రిగా పనిచేశారు. మహారాష్ట్ర గవర్నర్‌గా సేవలు అందించారు. పుట్టి పెరిగిన నాగారం గ్రామంలో యువకుల ఉపాధి కోసం ఉచిత వృత్తి విద్య శిక్షణ కేంద్రాన్ని జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ద్వారా యువకులకు ఉపాధి కల్పిస్తున్నారు. నాగారం గ్రామంలోని గుట్టపైన ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు భారీ అంజనేయ విగ్రహాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా శ్రీరామచంద్రస్వామి ఆలయాన్ని నిర్మించారు. ప్రస్తుతం తన కుమారుడు చెన్నమనేని వికాస్‌రావును ప్రజలకు పరిచయం చేస్తూ బీజేపీలో చేర్పించారు ప్రస్తుతం బీజేపీ వేములవాడ నియోజవర్గ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. బీజేపీలోకి రాకముందే ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. వేములవాడ నియోజకవర్గంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 108 అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు.

■ మల్కపేట గ్రామంలో పుట్టి పెరిగిన చల్మెడ ఆనందరావు సిరిసిల్ల ఎమ్మెల్యేగా గెలిచి న్యాయశాఖ మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం వృద్ధాప్యంలో ఉన్న ఆయన పుట్టి పెరిగిన గ్రామానికి ఏదో చేయాలని తపనతో కుటుంబ సభ్యుల సహకారంతో ఆరు కోట్లతో శ్రీరామచంద్రస్వామి ఆలయం, మూడు కోట్లతో విద్యాలయాన్ని నిర్మించారు. ఆయన కుమారుడు చల్మెడ లక్ష్మీనరసింహారావు, కరీంనగర్ చల్మెడ ఆసుపత్రి చైర్మన్ కొనసాగుతుఉన్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు. లక్ష్మీనరసింహారావు వేములవాడ నియోజకవర్గంలో పేదల కోసం వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు.





మల్కాపేటలో చల్మెడ లక్ష్మీనర్సింహారావు తండ్రి ఆనందరావు సహకారంతో రూ. 2 కోట్లతో నిర్మించిన ఆధునిక పాఠశాల



నాగారంలో మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు ప్రోత్సాహంతో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఉచిత వృత్తి విద్య శిక్షణ కేంద్రం




చెన్నమనేని రమేశ్‌బాబు ఆధ్వర్యంలో మంగళపల్లిలో మొదటిసారిగా సేవ్ స్వచ్ఛంద సంస్థ నిర్మించిన వాటర్ ట్యాంక్

### రాష్ట్ర స్థాయి నృత్య ప్రదర్శన పోటీల్లో ప్రతిభ


బహుమతి అందుకుంటున్న నిత్యశ్రీ

జగిత్యాల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కూచిపూడి నృత్య ప్రదర్శన పోటీల్లో జగిత్యాల పట్టణానికి చెందిన మహదేవుని నిత్యశ్రీ, వింజమూరి శ్రీకృతి అనే చిన్నారులు ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకున్నారు. హైద్రాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో గల ఎన్‌టీఆర్ కళామందిరంలో ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో శివాని ఆర్ట్స్ అసోసియేషన్ 15వ వార్షికోత్సవం సందర్భంగా తెలంగాణ స్థాయి నృత్య, పద్యనాటక పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం జరిగిన కూచిపూడి నృత్య పోటీల్లో జగిత్యాలకు చెందిన ఇరువురు చిన్నారులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. చిన్నారులు మహదేవుని నిత్యశ్రీ, వింజమూరి శ్రీకృతిలకు నిర్వాహకులు పరమేశ్వర్ బహుమతులు అందించారు. కాగా ప్రతిభ కనబరిచిన చిన్నారులను ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, జగిత్యాల మోదిని లలిత కళాక్షేత్రం నాట్యాచార్యులు బొమ్మిడి నరేశ్ తదితరులు అభినందించారు.

### ప్రమాదకరంగా ఎండిన వృక్షం

- భయపడుతున్న వాహనదారులు


సుద్దాల ప్రధాన రహదారి కూడలి వద్ద ఎండిన వృక్షం

కోనరావుపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారి ప్రధాన కూడలిలో రోడ్డుపై ఎండిన వృక్షం ప్రమాదకరంగా మారింది. దీంతో వాహన దారులు, గ్రామస్థులు భయాందోళన చెందుతన్నారు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలోని ప్రధాన రహదారి ప్రధాన కూడలిలో హరితహారం కార్యక్రమంలో భాగంగా పెట్టిన చెట్టు వృక్షంగా మారి ఎండిపోయింది. దీంతో ఎండిన వృక్షం తొలగించకపోవడంతో రోడ్డుపై ఎప్పుడు పడిపోతోందని వాహనదారులు, గ్రామస్థులు భయపడుతున్నారు. వృక్షం పడిపోయి ప్రమాదం జరగకముందే తొలగించాలని గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు.

### రేషన్ బియ్యం పట్టివేత


పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం

మల్లాపూర్, డిసెంబరు, 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపల్లి గ్రామం నుంచి అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి వచ్చిన సమాచారం మేరకు ఎస్సై కిరణ్‌తో పాటు సిబ్బందితో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో మల్లాపూర్ మండలంలో సేకరించిన రేషన్ బియ్యాన్ని టీఎస్ 18టీ 5471 నంబరు గల వాహనంలో తరలిస్తుండగా వేంపల్లి గ్రామంలో పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించి వారి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### సమాజ విలువలు పెంపొందించేందుకే కవితలు

- సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ


సంపుటిని ఆవిష్కరిస్తున్న సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సమాజ విలువలు పెంపొందించేందుకు కవితల సారాంశం ఎంతగానో ఉపయోగపడుతుందని సినీ గేయ రచయిత, జాతీయ అవార్డు గ్రహీత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు పెరంబదూర్ లింబగిరిస్వామి రచించిన 'నిశ్శబ్ద యుద్ధం' కవితా సంపుటిని శనివారం మెట్‌పల్లి మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన ఆవిష్కరించారు. ముందుగా జ్యోతి ప్రజ్వల చేసి సభ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల బాధలు, వారికి జరిగే అన్యాయాలు, దోపిడీ అణిచివేతలను ఎదుర్కొని సమాజ విలువలు పెంపొందించే విధంగా నిశ్శబ్ద యుద్ధం కవితా సంపుటిలో అక్షరబద్ధం చేశారన్నారు. ప్రతీ హృదయంలో సాహిత్యం వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు.

అనంతరం సుద్దాల అశోక్‌తేజను కవులు, అభిమానులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి దాస్యం సేనాధిపతి, నాట్యాచార్యులు తిరుక్కోవెల లక్ష్మణస్వామి, గంద్ర ఆనం దరావు, దురిశెట్టి మనోహర్, సత్యనారాయణ, బాలె శివాజీ, శరత్‌చంద్ర, కేశవస్వామి, శ్రీనివాస్ స్వామి, ఉపాధ్యాయులు, కవులు, శ్రోతలు, అభిమానులు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన అఖిల్, మధు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది అంతర్రాష్ట్ర విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీలకు రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఈసరి అఖిల్ (చీర్లవంచ), సిరిపురం మధు (రుద్రంగి) శాతవాహన యూనివర్సిటీ నుంచి ఎంపికయ్యారు. ఈ నెల 18 నుంచి 22 వరకు ఐదు రోజులపాటు కేరళలోని తిరువనంతపురంలో జరిగే దక్షిణాది అంతర్రాష్ట్ర విశ్వవిద్యాలయాల టోర్నమెంట్‌లో శాతవాహన యూనివర్సిటీ నుంచి అఖిల్, మధు పాల్గొననున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన అఖిల్, రుద్రంగి మండల కేంద్రానికి చెందిన మధు సిరిసిల్ల వీబీఏలో వాలీబాల్ శిక్షణ పొంది పలు టోర్నమెంట్లలో ప్రతిభ చాటాడు. గతంలో అఖిల్ జూనియర్స్, సీనియర్స్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టులో స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మధు ఎస్‌జీఎఫ్, జూనియర్స్ ఉమ్మడి కరీంనగర్ జట్టులో స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాడు.

వేములవాడ అగ్రహారం డిగ్రీ కళాశాలలో చదువుతూ శాతవాహన యూనివర్సిటీ స్థాయిలో ప్రతిభ కనబరిచిన అఖిల్ 2023-24లో మొదటిసారిగా దక్షిణాది అంతర్రాష్ట్ర విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇప్పుడు డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతూ 2024-25లో రెండోసారి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా అఖిల్, మధును వీబీఏ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు అభినందించారు.

### దంపతులపై దాడి చేసి చోరీ

బీర్‌పూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన కాసం ఈశ్వరయ్య అనే వ్యాపారి ఇంట్లో శనివారం తెల్లవారుజామున నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు ఈశ్వరయ్య దంపతులపై దాడి చేసి చోరీకి పాల్పడ్డారు. అతని భార్య ఒంటిపై ఉన్న మొత్తం 10 తులాల బంగారు నగలను, 10 తులాల వెండితో పాటు ఇంట్లో ఉన్న 10,000 వరకు నగదు ఎత్తుకెళ్లారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ రఘుచందర్ పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. బాధితుడు ఈశ్వరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బీర్‌పూర్ ఎస్సై కుమారస్వామి తెలిపారు. బాధితుడు ఈశ్వరయ్యను దొంగలు గాయపరచగా జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

### బేకరిపై మున్సిపల్ అధికారుల దాడులు

జగిత్యాల అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల పట్టణంలోని కొత్త బస్టాండ్ ఔట్ గేట్ ఎదురుగా ఉన్న బాబాసాయి బేకరిపై శనివారం రాత్రి మున్సిపల్ అధికారులు దాడులు చేశారు. బేకరిలో బూజు పట్టిన కేకులు విక్రయిస్తున్నారని వినియోగదారులు ఇచ్చిన ఫిర్యాదుతో మున్సిపల్ అధికారులు దాడులు చేశారు. కుళ్లి పోయిన కోడిగుడ్లు, దుర్వాసనతో ఉన్న కేకులు, బేకరీలో వాడే ఇతర ఆహార పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బేకరీ యజమానికి నోటీసులు ఇచ్చారు.

## శిథిలావస్థలో ఎస్సారెస్పీ డీ-86 ప్రధాన కాలువ

- కూలిన డ్రాప్‌లు.. కాలువకు గండ్లు
- నిధులు మంజూరైనా మరమ్మతు కరువు

ఎలిగేడు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూములకు వరప్రదాయినిగా నిలిచిన శ్రీరాంసాగర్ ఆయకట్టు నీటిని అందించే డీ-86 ప్రధానకాలువ శిథిలావస్థకు చేరుకుంది. కాలువ మరమ్మ తులకు 49.80లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసినా పనులను చేపట్టేందుకు టెండర్లు పూర్తి కాలేదు. దీంతో చివరి ఆయకట్టుకు ఎస్సారెస్పీ నీరు అందే పరిస్థితి కనబడడంలేదని రైతులు వాపోతున్నారు.

డీ-86 ప్రధాన కాలువద్వారా పెద్దపల్లి నియోజకవర్గంలోని ఎలిగేడు, సుల్తానాబాద్, జూలపల్లి, ఓదెల, శ్రీరాంపూర్ మండలాల్లోని వేలాది ఎకరాల భూముల్లో పండే పంటలకు సాగునీరు అందిస్తోంది. ఈప్రాంత రైతులు ఎస్సారెస్పీ నీటిని ఆధారం చేసుకొని అధికశాతం వరిపంటను సాగు చేస్తున్నారు. సాగునీటిని అందించే ప్రధాన కాలువ శిథిలావస్థకు చేరుకొని రెండు దశాబ్దాలు దాటినప్పటికీ మరమ్మతులు చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

డీ-86 ప్రధాన కాలువపై ఉన్న డ్రాప్‌లు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి, ఉపకాలువలకు వెళ్లే తూములు కూలిపోతు న్నాయి. మరోవైపు కాలువకు ఇరువైపులా గండ్లు పడి ప్రమాదకరంగా మారుతున్నాయి. అలాగే ఉపకాలువలు, పంట కాలువలు పిచ్చి మొక్కలతో నిండి ఉన్నాయి. దీంతో చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందడం లేదని రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఈ కాలువల పరిస్థితి ఇలాగే ఉంటే రానున్న యాసంగి పంటలకు వారబందీ పద్ధతిలో సరఫరా చేస్తే పంటలకు అరకొరగా అందే అవకాశం ఉండదని రైతులు వాపోతున్నారు. లాలపల్లి, ఎదురుగట నుంచి శివపల్లి వరకు డీ-86 ప్రధాన కాలువపై పెద్ద డ్రాప్లు కూలిపోగా మరికొన్ని చోట్లలోతైన మట్టి బుంగలు ఏర్పడ్డాయి. ఎప్పటికైన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని వెంటనే కాలువలు, డ్రాపులు మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.

### కాలువల మరమ్మతు చేపట్టాలి



కాసార్ల మహేందర్, రైతు, నారాయణపల్లి

ఎస్సారెస్పీ డీ-86ప్రధాన కాలువపై కూలిపోయిన డ్రాపులు, ఏర్పడిన బుంగల మరమ్మతులను వెంటనే చేపట్టాలి. లేకుంటే యాసంగిలో రైతులకు చివరి పంట భూములకు సాగునీరు అందక ఇబ్బందులు తలెత్తుతాయి.

### మరమ్మతులకు నిధులు మంజూరు



- ప్రసాద్, ఎస్సారెస్పీ ఈఈ

లాలపల్లినుంచి శివపల్లి వరకు ఉన్న ఎస్సారెస్పీ డీ-86 ప్రధాన కాలువ మరమ్మతులకు రూ.49.80లక్షలు నిధు లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పనులను చేపట్టేందుకు టెండర్లు పూర్తి కాలేదు. త్వరగా పనులను చేపట్టేందుకు కృషి చేస్తాం.


శివపల్లిలో కూలిన ఎస్సారెస్పీ కాలువ డ్రాప్


తెగిన డీ-86 ప్రధాన కాలువ


కూలిన తూమ్

# ఆయిల్‌పామ్ సాగుపై శిక్షణ

- రెబ్బల్‌దేవ్‌పల్లిలో 40 ఎకరాల్లో నర్సరీ
- ఎనిమిది లక్షల మొక్కల పెంపకం..
- అక్కడినుంచి జిల్లావ్యాప్తంగా పంపిణీ
- ఎస్సీలకు వంద, బీసీలకు తొంబై శాతం సబ్సిడీ
- నాలుగేళ్ల పాటు పెట్టుబడికి సాయం


రెబ్బల్‌దేవ్‌పల్లి నర్సరీలో పంపిణీకి సిద్ధంగా ఉన్న ఆయిల్‌పామ్ మొక్కలు

సుల్తానాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో తక్కువ పెట్టుబడితో దీర్ఘకాలికంగా ఆదాయాన్నిచ్చే ఆయిల్‌పామ్ సాగు వైపు దృష్టి సారిస్తున్నారు. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా రైతులకు సబ్సిడీ, పెట్టుబడి సాయం రూపంలో ప్రోత్సాహం అందిస్తున్నాయి. మూడేళ్ల క్రితం సుల్తానాబాద్ మండలం రెబ్బల్‌దేవ్‌పల్లిలో రాష్ట్ర ఉద్యానవన శాఖ వారి ఆధ్వర్యంలో తిరుమల కంపెనీకి చెందిన వారు ఆయిల్‌పామ్ నర్సరీని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ యంత్రాంగం ద్వారా ఆయిల్‌పామ్ సాగుపై రైతులను చైతన్యపరిచే కార్యక్రమం చేపట్టారు. గ్రామగ్రామాన అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలను ఆహ్వానించి రైతుల్లో సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

**• 48 ఎకరాల్లో నర్సరీ..**

**రాష్ట్రంలోని** అన్ని జిల్లాల్లో ఆయిల్ పామ్ నర్సరీలను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు రెబ్బల్‌దేవ్‌పల్లిలో నర్సరీని ఏర్పాటు చేశారు. గ్రామంలో 48 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ నర్సరీ ఏర్పాటు చేసి మొక్కలను విదేశాల నుంచి తెప్పించి వాటిని సంరక్షించారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి కలిగిన రైతులను గుర్తించి వారిని నర్సరీకి తీసుకువచ్చి తగిన శిక్షణ ఇప్పిస్తున్నారు. రైతుల భూములను గుర్తించి వాటికి నీటి వసతి ఉందా లేదా, ఆయిల్‌పామ్ సాగుకు యోగ్యమైన భూములు అవునా కాదా అని విచారిస్తారు. అవసరమైన చోట భూసార పరీక్షలు చేయించి సాగు కోసం సన్నద్ధం చేయిస్తారు.

**• మొక్కల సంరక్షణ..**

రెబ్బల్‌దేవ్‌పల్లిలో 2021లో ఆయిల్‌పామ్ నర్సరీ ఏర్పాటు చేశారు. ప్రైమరీ నర్సరీలో మొదట మూడు నుంచి నాలుగు నెలల వరకు మొక్కలను పెంచుతారు. అనంతరం ఆ మొక్కలను అక్కడి నుంచి తొలగించి వాటిని ఇరవై కిలోల మట్టి కవర్లలో పెట్టి సెకండరీ నర్సరీకి తరలిస్తారు. అక్కడ 12 నుంచి 14 నెలలు సంరక్షించిన అనంతరం వాటిని రైతులకు పంపిణీకి యోగ్యంగా ఉన్నవా లేవా నిర్ధారిస్తారు. నర్సరీలో సంరక్షించిన ఆయిల్ పామ్ మొక్కలను జిల్లాలోని 14 మండలాలకు చెందిన రైతులకు పంపిణీ చేస్తున్నారు.


నీరుకుళ్లలో ఆయిల్‌పామ్ పంట సాగు చేస్తున్న రైతులు(ఫైల్)

**పది వేల ఎకరాల్లో సాగు అంచనా..**

జిల్లాలో పదివేల ఎకరాల్లో ఆయిల్ పామ్ రైతులతో సాగు చేయించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు జిల్లాలోని అంతర్గాం మండలంలో 80 ఎకరాల్లో, ధర్మారం మండలంలో 314, ఎలిగేడులో 137, జూలపల్లిలో 2016, కమాన్‌పూర్‌లో 105, మంథనిలో 242, ముత్తారంలో 458, ఓదెలలో 162, పాలకుర్తిలో 153, పెద్దపల్లిలో 166, రామగిరిలో 119, రామగుండంలో 61, కాల్వశ్రీరాంపూర్‌లో 151, సుల్తానాబాద్‌లో 252 ఎకరాలతో కలిపి మొత్తం 4416 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వీరందరికీ తామే మొక్కలు పంపిణీ చేశామని రెబ్బల్‌దేవ్‌పల్లిలోని నర్సరీ నిర్వాహకులు తెలిపారు.

**• రైతులకు సబ్సిడీ...**

ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తిగల ఎస్సీ రైతులకు వంద, బీసీలకు తొంబై శాతం చొప్పున సబ్సిడీ ఇస్తారు. అలాగే డ్రిప్ కోసం అవసరమైన పెట్టుబడి మొత్తాన్ని అందించి నాలుగేళ్ల అనంతరం వాయిదాల రూపంలో కంపెనీ వారు వసూలు చేసుకుంటారు. ఆయిల్‌పామ్ సాగు చేసే ఒక్కొక్క రైతుకు ఎకరాకు రూ.4200 చొప్పున పెట్టుబడులు చెల్లిస్తారు. ఇలా నాలుగేళ్లకు దాదాపు పదిహేడు వేల రూపాయల వరకు ప్రభుత్వం చెల్లిస్తుంది.

**ఎకరాకు రూ.1,140 చెల్లిస్తే చాలు..**

- శివ, నర్సరీ మేనేజర్



ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులు ఒక్కో మొక్కకు 20 రూపాయల చొప్పున ఎకరా సాగు కోసం 57 మొక్కలకు రూ.1140 చెల్లిస్తే సరిపోతుంది. ఆయిల్ పామ్ పంటలో రైతులు అంతర పంటలు కూడా వేసుకోవచ్చు. నాలుగేళ్లలో మొక్కజొన్న, వేరుశనగ, పత్తితో పాటు కూరగాయలను అంతర పంటగా సాగు చేసుకోవాలి. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు 30 ఏళ్ల వరకు ఆదాయం వస్తుంది.

## ఎయిర్‌ఫోర్స్‌కు సైనిక్ స్కూల్ విద్యార్థి ఎంపిక


సిద్ధార్థ

చొప్పదండి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలంలోని రుక్మాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ స్కూల్ విద్యార్థి రామడుగు సిద్ధార్థ ఎయిర్‌ఫోర్స్‌కు ఎంపికయ్యాడు. 12వ తరగతి పూర్తి చేసిన సిద్ధార్థ్ ఎన్డీఏ పరీక్షలో ప్రతిభ చాటి ఎయిర్‌ఫోర్స్ వింగ్‌కు ఎంపికయ్యాడు. కాగా సిద్ధార్థ్‌ను గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణి, సంయుక్త కార్యదర్శి సక్రు నాయక్, జోనల్ ఆఫీసర్ భీమయ్య అభినందించారు. ఈ మేరకు ఎన్డీఏకు ఎంపికకు కృషి చేసిన పాఠశాల డైరెక్టర్ కల్నల్ కేసీ రావు, ప్రిన్సి పాల్ కాళహస్తి, సిబ్బందిని సంస్థ కార్యదర్శి అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో మాజీ ఎంపీటీసీ మృతి

గంగాధర, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో మాజీ ఎంపీటీసీ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర మండలం కురిక్యాలకు చెందిన మాజీ ఎంపీటీసీ నందయ్య(50) శనివారం మధురానగర్ చౌరస్తాకు బైక్‌పై పని నిమిత్తం వెళుతున్నాడు. ఇదే సమయంలో కొడిమ్యాల మండలానికి ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై కరీంనగర్ వైపు వస్తున్నాడు. మధురానగర్ చౌరస్తాలో రెండు వాహనాలు వేగంగా ఢీకొన్నాయి. కిందపడిన నందయ్యకు తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు 108లో కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు.

## త్రీడీ ఆర్టిస్టును అభినందించిన గవర్నర్

రామగిరి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ త్రీడీ ఆర్టిస్ట్ ఎస్ఎస్ఆర్ కృష్ణను శనివారం గవర్నర్ జిష్ణుదేవ్ అభినందించారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి త్రీడీ ఆర్ట్ గురించి వివరించారు. వివిధ దేశాల్లో కృష్ణ గీసిన త్రీడీ చిత్రాలను ఆసక్తిగా గవర్నర్ పరిశీలించి కృష్ణను అభినందించారు. మహాభారత కాలంనాటి ఈ త్రీడీ ఆర్ట్‌ను అభివృద్ధి చేయాలని, రాజ్‌భవన్ స్కూల్‌లో త్రీడీ ఆర్ట్ అవగాహన వర్క్‌షాప్ నిర్వహించాలని గవర్నర్ సూచించారు.

# నిఫ్ట్ కోర్సులతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

**- మొదలైన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు - జనవరి 6 వరకు అవకాశం**



మాట్లాడుతున్న ప్రొఫెసర్లు అనంతఫణి, రామకృష్ణ, నరేష్‌కుమార్

సుభాష్‌నగర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్) కోర్సులతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయని, అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభమైనట్లు ఇనిస్టిట్యూట్ ప్రొఫెసర్లు అనంతఫణి, రామకృష్ణ, నరేష్‌కుమార్ తెలిపారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలియచేశారు. ఈ కోర్సులో అండర్ గ్రాడ్యుయేట్స్ కోర్సులలో ఫ్యాషన్ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్, యాక్సెరీ డిజైన్, నిట్‌వేర్ డిజైన్, లెదర్ డిజైన్, ఫ్యాషన్ కమ్యూనికేషన్, ఫ్యాషన్ టెక్నాలజీ ఉన్నాయని తెలిపారు. ఇంటర్మీడియట్ అర్హతతో ఇందులో చేరవచ్చన్నారు. డిగ్రీ, పీజీ చేసినవారు కూడా ఈ కోర్సులో చేరవచ్చన్నారు. ఎక్కువగా ఉత్తర భారతదేశానికి చెందిన వారే ఇందులో చేరుతుంటారని, దక్షిణ భారత్‌లో దీనిపై ఎవరూ దృష్టి పెట్టరని అన్నారు. 2025 విద్యా సంవత్సరానికి నవంబరు 20 నుంచే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభమైందని, 6 జనవరి 2025తో గడువు ముగుస్తుందని తెలిపారు. రూ. 5వేల ఫైన్‌తో జనవరి 7 నుంచి 9 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉందన్నారు. 9 ఫిబ్రవరి 2025లో ఎంట్రెన్స్ ఎగ్జామ్ ఉంటుందన్నారు. ఏప్రిల్ చివరిలో ఫలితాలు ప్రకటిస్తారని, జూన్ 2025లో సీట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

## బోర్డులో అన్ని కార్మిక సంఘాలకు అవకాశం ఇవ్వాలి

**- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ**

గోదావరిఖని, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు నిర్ణయించే బోర్డులో అన్ని కార్మిక సంఘాలకు అవకాశం ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం గోదావరిఖనిలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో దివంగత సీఎం రాజశేఖరరెడ్డి హయాంలో కనీస వేతనాల మండలిని నియమించారన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పట్టించుకోలేదన్నారు. మళ్లీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వేతన మండలి చైర్మన్‌ను నియమించింది కానీ సభ్యులను నియమించకుండా కాలయాపన, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కనీస వేతన సవరణ చట్టానికి అనుగుణంగా జీవోలను జారీ చేయాలని డిమాండ్ చేశారు. కేవలం ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీలకు మాత్రమే స్థానం కల్పించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు నరేష్, అశోక్, చిలుక శంకర్, దుర్గయ్య, రవికుమార్, సాంబయ్య, ప్రవీణ్‌కుమార్, నర్సయ్య పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఐ కృష్ణ

## ఎంసీహెచ్‌లో శిశువు మృతి

**- అట్ట డబ్బాలో పెట్టి తండ్రికి అప్పగించిన సిబ్బంది -ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం**


ఆస్పత్రి వద్ద రోదిస్తున్న తల్లి, బంధువులు,
(ఇన్‌సెట్‌లో శిశువును అట్ట డబ్బాలో పెట్టి ఇచ్చిన సిబ్బంది)

జగిత్యాల అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మాతా శిశు కేంద్రంలో దారుణం చోటు చేసుకుంది. పుట్టినప్పుడు ఆరోగ్యంగా ఉన్న శిశువు రెండు రోజుల తర్వాత అకస్మాత్తుగా మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యంతో తన కుమారుడు మృతి చెందాడని శిశువు తండ్రి ఆరోపిస్తున్నాడు. ఆలస్యంగా ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం నగునూర్ లచ్చక్కపేటకు చెందిన కిషోర్-శ్రీలతలకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మూడో సంతానంగా జగిత్యాలలోని మాతా శిశు కేంద్రంలో ఈనెల 10వ తేదీ మంగళవారం కుమారుడు జన్మించాడు. శిశువు పుట్టిన తర్వాత పరీక్షించిన వైద్యులు ఆరోగ్యంగా ఉన్నాడని చెప్పడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. భార్య వద్ద తన బంధువును ఉంచిన కిషోర్ పనికోసం బయటకు వెళ్లాడు. గురువారం సాయంత్రం ఆస్పత్రి నుంచి బాబు సీరియస్‌గా ఉన్నాడంటూ కిషోర్‌కు ఫోన్ రావడంతో హడావిడిగా మాతా శిశు కేంద్రానికి చేరుకున్నాడు. ఆయనకు బాబు మృతి చెందాడని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. అప్పటివరకు ఆరోగ్యంగా ఉన్న బాబు ఎలా మృతి చెందాడని ప్రశ్నిస్తే వైద్యులు ఒక్కొక్కరు ఒక్కోరకమైన సమాధానం చెప్పారని కిశోర్ ఆరోపిస్తున్నాడు. బాబుకు ఆస్పత్రి సిబ్బంది వ్యాక్సిన్ ఇచ్చారని, వ్యాక్సిన్ ఇచ్చిన తర్వాతనే మృతి చెందాడని అతను ఆరోపిస్తున్నారు. మృత శిశువును తన చేతికి అప్పగించారని, తర్వాత కాటన్ డబ్బాలో శిశువును పెట్టి హడావిడిగా అక్కడి నుంచి పంపించారని ఆరోపించాడు. శిశువు మృతి చెందిన విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములను వివరణ కోరగా బాబు ఆరోగ్యంగా జన్మించాడని, ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని, పాలు సరిగా పట్టకపోవడం వల్ల పాలు ముక్కులోకి వెళ్లి శ్వాస అందక మృతి చెందాడని ఆయన వివరణ ఇచ్చారు.

# వైభవంగా అయ్యప్ప పడి పూజ


రాజన్న ఆలయంలో ప్రదక్షిణ చేస్తున్న నిర్వాహకులు, అర్చకులు


కోరుట్లలో కర్పూర హారతులు అందిస్తున్న స్వాములు

కోరుట్ల రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగెం గ్రామంలోని సంగమేశ్వర ఆలయంలో శనివారం అయ్యప్ప పడి పూజ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన వేదపండితుడు పాలెపు రామకృష్ణ శర్మ మంత్రోచ్చారణల మధ్య పడి పూజ మహోత్సవం నిర్వహించారు. గురుస్వామి సుద వేణి భూమయ్య ఆధ్వర్యంలో 18వ సారీ దీక్ష భూనిన శంకర్ పడి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. గణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్ప ఉత్సవ విగ్రహాలకు పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వాములు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు.

**- వైభవంగా ఆరట్టు ఉత్సవం**

**వేములవాడ కల్చరల్:** వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ అయ్యప్ప ఆలయంలో శనివారం ఆరట్టు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఒంటి గంటకు రాజరాజేశ్వ రస్వామి ఆలయంలోని ధర్మగుండంలో చక్రస్నానం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం 6.30 గంటలకు ఆలయంలో పడిపూజ నిర్వహించారు. ఆలయ చైర్మన్ కొండ దేవయ్యపాల్గొన్నారు.

**- ఆరట్టు ఉత్సవంలో ప్రభుత్వ విప్**

వేములవాడ మున్సిపల్ పరిధిలోని అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్వహించిన ఆరట్టు ఉత్సవానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ తదితరులు ఉన్నారు.

## భక్తజన సంద్రంగా రాజన్న క్షేత్రం


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తజన సంద్రంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు రాజన్న ఆలయానికి చేరుకుని ఆలయ వసతిగుదుల్లో విడిది చేశారు. తెల్లవారు జామున కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించిన భక్తులు ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు, పీఆర్వో అశోక్, ఎడ్ల శివసాయిలు ఏర్పాట్లు చేశారు.

### రాజన్నను దర్శించుకున్న మితాలి మధుస్మిత

వేములవాడ రాజరాజేశ్వరస్వామిని ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ఇన్‌కామ్‌టాక్స్ ఐఆర్ఎస్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మితాలి మధుస్మిత శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాధికారులు ఘన స్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

## ఘనంగా దత్తాత్రేయ స్వామి జయంతి


అలంకరణలో స్వామివారు

ధర్మపురి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 8 నుంచి ఆరంభమైన దత్తాత్రేయ స్వామి నవరాత్రోత్సవాల్లో భాగంగా పౌర్ణమి రోజున ఉదయం స్థానిక లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ రామలింగేశ్వర స్వామి ఆలయం పక్కనే గల ఆలయంలో, గోదావరి నదీ తీరాన గల ఆలయంలో దత్తాత్రేయ స్వామి వారలను అందంగా పూలతో అలకంరించారు. అనంతరం ఆలయ అభిషేక్ పౌరోహితులు బొజ్జ రాజగోపాల్‌శర్మ, ద్యారం గురుప్రసాద్ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి వారలకు రుద్రాభిషేకం, పురుషసూక్తం, విశేష పూజలు జరిపారు. పౌర్ణమి సందర్భంగా లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో అనేక మంది భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గోదావరి నదీ తీరాన గల ఆలయంలో రాత్రి వేళలో మంత్ర జాగరణ, ప్రత్యేక పూజలు, హారతి, తీర్థ, ప్రసాద వితరణ జరిపారు. అలాగే దివ్యదర్శనం, బాల దత్తాత్రి డోలోత్సవం జరిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, రొట్టె శ్రీనివాస్ పాల్గొన్నారు. ధర్మపురి క్షేత్రంలోని గోదావరి నదీ తీరాన గల శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం పూజలు నిర్వహించారు.

## అంజన్న సన్నిధిలో భక్తుల సందడి

మల్యాల, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానం శనివారం వేలాది భక్తులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు అంజన్నను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు, ఇతర పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు

**● రేపటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు**

కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో గల ఉప ఆలయం వెంకటేశ్వరస్వామి సన్నిధిలో సోమవారం నుంచి నెల రోజుల పాటు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రామకృష్ణరావు తెలిపారు. ఈ సందర్భంగా నిత్యం అండాల్ అమ్మవారికి పంచామృత అభిషేకం, తిరుప్పావై అనుసంధానం, పొంగలి నివేదన, భజన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఇందులో భాగంగా జనవరి 10న వైకుంఠ ఏకాదశి, ఉత్తర ద్వారా దర్శనం, 13న గోదా రంగనాథ కళ్యాణ ఉత్సవాలు జరుగుతాయని అన్నారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ ఉత్సవాలలో పాల్గొనాలని కోరారు

## ఉమ్మడి జిల్లా షూటింగ్ బాల్ పోటీలకు స్పందన


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా యునైటెడ్ షూటింగ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా షూటింగ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలకు స్పందన లభించింది. జిల్లా కేంద్రంలోని సప్తగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి 160 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభచాటారు. ఈ పోటీల్లో విశేష ప్రతిభచాటిన క్రీడాకారులను ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు నల్గొండ జిల్లాలో నిర్వహించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఈ పోటీలను ఉమ్మడి జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఆరిఫ్ పాషా, మహ్మద్ ముఫాజిల్ అహ్మద్ పర్యవేక్షించారు. పోటీల నిర్వహణలో వ్యాయామ ఉపాధ్యాయులు, ఆశాలు కుమార్, నాగరాజు, సీనియర్ క్రీడాకారులు ఆదిత్య, నరేశ్, వంశీ, అద్నాన్, సబిక్ పాల్గొన్నారు.

## స్నేహితుడని నమ్మితే నట్టేట ముంచాడు

**- 15 మంది క్రెడిట్ కార్డులు స్వైప్ చేసి ఉడాయించిన యువకుడు**

**- పోలీసులను ఆశ్రయించిన బాధితులు**

జగిత్యాల అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడని నమ్మిన వ్యక్తి కుటుంబ సభ్యులు అనారోగ్యంతో ఉన్నారని చెప్పి ఒకరికి తెలియకుండా ఒకరి వద్ద క్రెడిట్ కార్డులు తీసుకుని 40 లక్షలతో ఉడాయించాడు. ఈ సంఘటన జగిత్యాల జిల్లా కేంద్రంలో జరగగా బాధితులు శనివారం పోలీసులను ఆశ్రయించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జామ్‌బాగ్‌కు చెందిన కల్లెం యశ్వంత్ ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. తన తల్లి, భార్య అనారోగ్యం పేరు చెప్పి ఒకరికి తెలియకుండా ఒకరి వద్ద 15 మంది క్రెడిట్ కార్డులు తీసుకుని 40 లక్షల రూపాయలు స్వైప్ చేశాడు. ఆ డబ్బులు తీసుకుని ఉడాయించాడు. క్రెడిట్ కార్డులు లేని వారికి క్రెడిట్ కార్డులు ఇప్పించి మరీ మోసగించాడని బాధితులు వాపోయారు. దీంతో బాధితులు శనివారం అతని ఇంటి ఎదుట బైఠాయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి బాధితులతో మాట్లాడారు. అనంతరం బాధితులు జగిత్యాల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రెండు నెలల నుంచి పరారీలో ఉన్న యశ్వంత్‌ను పట్టుకుని తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు.

# తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి

● అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ● కామన్ డైట్ కార్యక్రమం ప్రారంభం



విద్యార్థులతో భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని, మంచిగా చదువుకొని సమాజంలో గొప్పగా పేరు తెచ్చుకోవాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అన్నారు. శనివారం సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాలలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కామన్ డైట్ మెనూను ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో పరిశుభ్రతతో పాటు వంటశాలలు, విద్యార్థుల కోసం తయారు చేస్తున్న వంటలను పరిశీలించారు.

సిరిసిల్ల పట్టణంలోని పలు వసతిగృహాలకు నియమించిన జిల్లా అధికారులు పాల్గొని కామన్ డైట్ మెనూ ప్రారంభించారు. విద్యార్థులతోకలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా అన్ని గురుకుల పాఠశాలలతోపాటు వసతి గృహాల్లో విదార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమా లు అకట్టుకున్నాయి. ఈ సందర్భంగా చిన్నబోనాల గురుకులంలో నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలన్నారు. డీఎస్‌సీడీవో విజయలక్ష్మీ, గురుకుల జిల్లా కో- ఆర్డినే టర్ థెరిసా, తహసీల్దార్ ఉమరాణి పాల్గొన్నారు.

**ఎల్లారెడ్డిపేట:** విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగితే బంగారు భవిష్యత్ లభిస్తుందని ఎస్పీ అఖిల్‌మహాజన్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు దుమాల, అల్మాస్‌పూర్, గొల్లపల్లిలోని మహాత్మాజ్యోతిబాపూలే డిగ్రీ కళాశాల, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్, బీసీ వసతి గృహం, కేజీబీవీల్లో కామన్ డైట్ కార్యక్రమాలను అధికారులు, ప్రజాప్రతినిధులు శనివారం నిర్వహించారు. దుమాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఎస్పీ అఖిల్‌మహాజన్ సందర్శించారు. పాఠశాల పరిసరాలు, వంట గది, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్‌మహాజన్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. విద్యార్థులు పట్టుదల, ప్రణాళికబద్ధంగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఒత్తిడి నుంచి దూరం కావడానికి యోగా, ధ్యానం చేయాలన్నారు. విద్యార్థి దశలో సోషల్ మీడియా, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. బంగారు భవిష్యత్‌ను అంధకారం చేసుకోవదన్నారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం మాట్లాడుతూ వసతి గృహాల్లో ఒకే రకమైన భోజనం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ వ్యాప్తంగా కామన్ డైట్ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. గతంలో ఉన్న డైట్, కాస్మెటిక్ చార్జీలను కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిందని అన్నారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, తహసీల్దార్ రామచంద్రం, ఎంపీడీవో సత్తయ్య, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ రమాకాంత్, ఆయా పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

**తంగళ్లపల్లి:** వసతి గృహాలపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థుల సంక్షేమం కోసం అధికంగా నిధులను వెచ్చిస్తుందని గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ అన్నారు. శనివారం తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీ ట్రైబల్ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో కామన్ డైట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు.

ఈ సందర్భంగా వసతి గృహంలోని తరగతి గదులను, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనంపై అరాతీశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా వసతి గృహాల్లోని విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం వసతి గృహాల్లోని విద్యార్థులకు కాస్మెటిక్, డైట్ చార్జీలను పెంచిందన్నారు. బద్దెనపల్లి బాలికల వసతి గృహంలో కామన్ డైట్ ప్రోగ్రాంను మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెల్ముల స్వరూపరెడ్డి ప్రారంభించారు. ప్రిన్సిపాల్ పద్మ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరేళ్ల నర్సింగం గౌడ్, కాంగ్రెస్ నాయకులు జాల్గం ప్రవీణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీనివాసరెడ్డి, రాములు, గడ్డం మధుకర్,మునిగెల రాజు, గుగ్గిళ్ల శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

● ప్రభుత్వం వసతి గృహాల్లోని విద్యార్థులకు ఛార్జీలను పెంచడంతో పోషకాహారం అందుతుందని డిప్యూటీ కలెక్టర్ రాధాబాయి అన్నారు. శనివారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో కామన్ డైట్ పోగ్రాంను ఆమె ప్రారంభించారు. డైట్ ఛార్జీలను 40 శాతం పెంచార న్నారు. పిన్సిపాల్ రెహాన ఇర్ఫత్ పాల్గొన్నారు.

**గంభీరావుపేట:** మండలం నర్మాల గురుకుల పాఠశాలలో శనివారం ప్రభుత్వం పెంచిన డైట్, కాస్మెటిక్ చార్జీల పైన అవగాహన కార్యక్రమా న్ని నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొమిరిశెట్టి విజయ, ప్రిన్సిపాల్ సృజన, ఆర్ఐ సత్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీ ద్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, బీసీ సం క్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శహన్మండ్లు ఉన్నారు.

**చందుర్తి:** విద్యార్థుల ఎదుగుదల ఆరోగ్యంపై ప్రభుత్వం అత్యంత శ్రద్ధ వహిస్తుందని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో కామన్ డైట్ మెనూను శనివారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్స్‌లో కామన్ డైట్ వివరాలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాల న్నారు. ప్రతి హాస్టల్‌లో ఒకే రకమైన ఆహారం విద్యార్థులకు అందిస్తామన్నారు. వంట గదులు, భోజనశాలలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఇన్‌చార్జి ఎండీవో ప్రదీప్ కుమార్, కార్యదర్శి శ్రీనివాస్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

**కోనరావుపేట:** విద్యార్థులకు ప్రభుత్వం నిబంధన మేరకు కొత్తగా ప్రవేశపెట్టిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఇరిగేషన్ ఈఈ అమరేందర్ రెడ్డి అన్నారు. కోనరావుపేట మండలం ధర్మారంలోని ఎస్టీ హాస్టల్లో కామన్ డైట్ మెనూను ప్రారంభించారు. లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని ఆదేశించారు.

**రుద్రంగి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కామన్ డైట్ కార్యక్రమాన్ని రుద్రంగి మండల కేంద్రంలోని బాలుర వసతి గృహంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి ప్రారంభించారు. ఎంపీడీవో నటరాజ్, ఎర్రం గంగనర్సయ్య, గండి నారాయణ, పల్లి గంగాధర్, పిడుగు లచ్చిరెడ్డి, దయ్యాల శ్రీనివాస్, పడాల శ్రీనివాస్, దసారి గంగారాజం పాల్గొన్నారు.

**ముస్తాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన భోజనాన్ని అందిస్తోందని ముస్తాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణినర్సిం అన్నారు. గురుకుల పాఠశాలలో కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని ఏఎంసీ చైర్మన్ తలారినర్సింలు శనివారం ప్రారం భించారు. డైట్ చార్జీల పెంపు, కామన్ డైట్ మెనూతో విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేశ్, ప్రిన్స్‌పాల్ ఉదయ్‌రెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పసుల వెంకటి పాల్గొన్నారు.



దుమాలలో భోజనం చేస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్



హాజరైన జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్



విద్యార్థులతో భోజనం చేస్తున్న తహసీల్దార్ సురేశ్

## సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణరాఘవరెడ్డి, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గుడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్ష శిబిరంలో ఉద్యోగులకు సంఘీభావం ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మినిమమ్ టైమ్ స్కేల్ ఇవ్వాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ఇప్పపూల దేవేందర్, బుర్ర జలేందర్, జయలక్ష్మీ, నీరజ ఉన్నారు.



సంఘీభావం తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

## నేడు ఉచిత అబాకస్ శిక్షణ

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): గణితంపై ఆసక్తి ఉన్న వారికి ఈ నెల 15 ఆదివారం రోజున పట్టణంలోని స్థానిక పొన్నాల గార్డెన్‌లో అడ్లగట్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత టీచర్ అబాకస్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గంగాధర్ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా 21ఏళ్ల పైబడిన యువతీ, యువకు లకు ఉపాధ్యాయులు, గణితంపై ఆసక్తిగల వారికి ఈ ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించే ఈ వర్క్‌షాప్‌లో గణిత నైపుణ్యాలను మెరుగుపర్చేలా శిక్షణ ఉంటుందన్నారు. పాల్గొనే వారు పేరు, ఆధార్ కార్డును 9440444956 వాట్సాప్ నంబరుకు పంపించాలని కోరారు.

## క్రీడలతో స్నేహభావం పెంపు



గెలుపొందిన జట్టుతో ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం బైపాస్ రోడ్డు సమీపంలోని మైదానంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. విధి నిర్వహణలో బిజీగా ఉండే పోలీసులకు క్రీడలు కొంత ఆహ్లాదానికి దోహదపడుతాయన్నారు. అనంతరం నిర్వహించిన టోర్నీలో సిరిసిల్ల డీఎస్పీ జట్టు, ఎస్పీ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్‌చేసిన సిరిసిల్ల డీఎస్పీ టీం 15 ఓవర్లకు 4 వికెట్లు కోల్పోయి 109 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన జిల్లా ఎస్పీ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 4 వికెట్స్‌ను కోల్పోయి 102 పరుగులు చేసింది. ఏడు పరుగుల తేడాతో డీఎస్పీ జట్టు విజయం సాధించింది. ఈ క్రికెట్ మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్‌గా వేములవాడ ట్రాఫిక్ ఎస్సై రాజు అందుకున్నారు. డీఎస్పీలు చంద్రశేఖర్‌రెడ్డి, మురళీకృష్ణ, సీఐలు కె.కృష్ణ, శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

- నిర్వాసితులకు అండగా ఉంటా
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలం చింతలఠాణ గ్రామంలో మంజూరైన 19 మందికి సీఎం సహాయనిధి చెక్కులను శనివారం అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వవిప్, శాసన సభ్యులు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందనడానికి నిదర్శనం రాజీవ్ ఆరోగ్యశ్రీని రూ 10 లక్షలకు పెంచడమే అన్నారు. సీఎం సహాయనిధి ద్వారా రాష్ట్రంలో ఇప్పటి వరకు రూ 800 కోట్ల పైచిలుకు ఇచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి ఇప్పటి వరకు సీఎం సహాయనిధి, ఎల్‌వోసీల ద్వారా సుమారు రూ. 10 కోట్ల పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ముంపు గ్రామాల సమస్యలపై ఆనాడు పాలుపంచుకున్నానని, సంకెపల్లి గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి తీసుకురావడం జరిగిందని అన్నారు. సమస్యల పరిష్కారానికి పొన్నం ప్రభాకర్, జీవన్‌రెడ్డి వంటి వారు సైతం నిర్వసితులకు అండగా నిలిచారని గుర్తు చేశారు. నిర్వసితులకు 4 వేల 696 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేశారని, రానున్న రోజుల్లో పార్టీలకతీతంగా ఏ పార్టీ అని చూడకుండా లబ్దిదారులకు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ముంపు గ్రామాలలో పెండింగ్‌లో వున్న 3 వేల 600 దరఖాస్తులకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మీలో ఒక్కడిగా ఉంటూ నిర్వసితుల సమస్యల్లో అడుగుల్లో అడుగులు వేసిన వాడిగా మీకు అండగా ఉంటానని అన్నారు. ముంపు గ్రామాల్లో రాబోవు రోజుల్లో పరిశ్రమలు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

● ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యలను గుర్తు చేసుకుంటూ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. వేములవాడ మండలం చింతలఠాణ గ్రామంలో సీఎం సహాయ నిధి చెక్కులు పంచేందుకు వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పిల్లి కనుకయ్య మాట్లాడుతూ ఎన్నో ఏండ్ల ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కాలేదని అన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తోనే నిర్వాసితుల సమస్యలు పరిష్కారం అవుతాయని, రాజకీయాలకు అతీతంగా ఆది శ్రీనివాస్‌ను నమ్మి ముందుకు రావాలని గుర్తు చేసుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. అక్కడే ఉన్న ఆది శ్రీనివాస్ లేచి కనుకయ్యను ఓదార్చారు. దీంతో మండలంలో పిల్లి కనుకయ్య కన్నీటిపర్యంతమైన వీడియో వైరల్‌గా మారింది.

## బీఆర్ఎస్ నియంతృత్వ పాలనకు చరమగీతం



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గత బీఆర్ఎస్ ప్రభుత్వ నియంతృత్వ పాలనను గ్రహించిన తెలంగాణ ప్రజలు చరమ గీతం పాడారని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధినాయకత్వం రాష్ట్రాన్ని దోచుకుంటే వారి అన్యాయులు వివిధ ప్రాంతాలలో ప్రభుత్వ ఆస్తులను తమ సొంత ఆస్తులుగా భావించి ఎక్కడికక్కడ దోపిడీ చేశారన్నారు. ప్రస్తుతం అధికారం కోల్పోయిన కేటీఆర్, హరీష్‌రావు ఆగమాగం అవుతున్నారని, ప్రభుత్వం, అధికారులపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి పాలనలో చట్టాలకు ఎవరూ అతీతులు కాదన్నారు. సినీ నటుడు అల్లు అర్జున్ అరెస్టు చేస్తే ప్రభుత్వ అభద్రత భావమని కేటీఆర్ విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. కళలను తాము కూడా గౌరవిస్తామని, అవార్డులు వచ్చినవారంటూ చట్టాలకు ఎవరూ చుట్టాలు కాదని అన్నారు. అనంతరం సిరిసిల్ల పట్టణంలోని బీసీ హాస్టల్ విద్యార్థులతో కలసి కేకే మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు భోజనం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, కౌన్సిలర్ కుడికాల రవికుమార్, మాజీ కౌన్సిలర్ కత్తెర దేవదాస్, రాగుల జగన్, ఆడెపు చంద్రకళ, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నీలి రవీందర్, మాజీ డైరెక్టర్ నేరెళ్ళ శ్రీకాంత్‌గౌడ్, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

## పెరిగిన చలి

(5వ పేజీ తరువాయి)

వైద్యులు సూచిస్తున్నారు. కొవిడ్ కొత్త వేరియేంట్ కేసులు కూడా మొదలైన నేపథ్యంలో అప్రమత్తత తపనిసరని హెచ్చరిస్తున్నారు. మాస్కులుధరించాలని సూచిస్తున్నారు. అస్తమా, ఇతర శ్వాసకోస సంబంధంమైన ఇబ్బందులు ఉన్నవారు ఇబ్బందులకు గురవుతున్నారు. చలి తీవ్రత దృష్ట్యా దీర్ఘకాలిక వ్యాదులతో బాధపడుతున్నావారు మరింత అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గుండె జబ్బులు ఉన్నవారు, గుండె ఆపరేషన్ చేయించుకున్నవారు వాకింగ్ చేయవద్దని సూచిస్తున్నారు. చలిలో ఎక్కువగా తిరగడంతో రక్తనాళాలు సంకోచించి గుండెకు సంబంధించిన సమస్యలు వస్తాయని, బీపీ, షుగర్ ఉన్నవారు కూడా జాగ్రత్తలు పాటించాలని సూచనలు చేస్తున్నారు. చర్మ సమస్యలకు సంబంధించి జాగ్రత్తలు పాటించి మాయిశ్చరైజర్‌లు ఉపయోగించాలని సూచనలు చేస్తున్నారు.

## పేద విద్యార్థులకు ప్రాధాన్యం ఇవ్వాలి




మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు పాఠశాలలో పేద విద్యార్థులకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం మినీ స్టేడియంలో ఓ ప్రైవేటు పాఠశాల ఆధ్వర్యంలో జోనల్ స్పోర్ట్స్ మీట్‌ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. రానున్న ఒలంపిక్స్ లక్ష్యంగా రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభించనున్నట్లు చెప్పారు. గ్రంథాలయం జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెల్ముల స్వరూప తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళా జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జలగం ప్రవీణ్, మాజీ కౌన్సిలర్లు ఆడెపు చంద్రకళ, ఆడెపు ప్రభాకర్, మాజీ పీసీసీ కార్యదర్శి గడ్డం నర్సయ్య పాల్గొన్నారు.

## తాజా మాజీ సర్పంచుల జేఏసీ కమిటీ ఏకగ్రీవం



రాష్ట్ర, జిల్లా అధ్యక్షులను సన్మానిస్తున్న సభ్యులు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తాజా మాజీ సర్పంచుల జేఏసీ రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం సిరిసిల్ల పట్టణంలో తాజా మాజీ సర్పంచుల జేఏసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్ ఆధ్యక్షతన జరిగిన జిల్లా సమావేశంలో నూతన జేఏసీ కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా దుమ్మ అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా తాడెపు ఎల్లం, కార్యదర్శులుగా కోల నరసయ్య, గున్నాల లక్ష్మణ్, గాండ్ల సుమతి, సిరికొండ శ్రీనివాస్, చిట్టినేని శ్రీనివాస్‌రావు, ఆరె మహేందర్, తంపుల సుమన్, దోమకొండ ఎల్లం, సోషల్ మీడియా కన్వీనర్‌గా పిట్ల సతీష్, జిల్లా సలహాదారులుగా చాకలి రమేష్, మల్లేశం ఎన్నికయ్యారు.

## ఉద్యోగం సాధించిన యువ ఫౌండేషన్ అభ్యర్థులు

వేములవాడ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వేములవాడలోని యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ పొందిన ఇద్దరు యువకులు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ జనరల్ డ్యూటీ విభాగంలో ఉద్యోగాలు సాధించారని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కానిస్టేబుల్ గొడిశెల రాజశేఖర్ గౌడ్ తెలిపారు. ఇటీవల జరిగిన స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షలో అర్హత సాధించడం ద్వారా వేములవాడ రూరల్ మండలం జయవరం గ్రామానికి చెందిన అరవింద్ ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్, కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామానికి చెందిన రాకేష్ సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ విభాగాలలో ఉద్యోగాలు పొందారని ఆయన వివరించారు. ఉద్యోగం సాధించిన యువకులను వేములవాడ రూరల్ ఎస్ఐ మారుతి అభినందించారు.

## పల్లె విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు

ముస్తాబాద్, డిసెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుర్కపల్లె గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మానేరు ఒడ్డున గల తుర్కపల్లె గ్రామానికి చెందిన కాశోల్ల విష్ణు అనే యవకుడు ఇండో టిబిటన్ బార్డర్ పోలీసుగా, మచ్చ ప్రకాశ్ అనే యవకుడు ఇండిస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ జనరల్ డ్యూటి విభాగంలో ఎంపికయ్యారు. వీరిద్దరికి గ్రామస్థులు, యూత్ సభ్యులు శనివారం వారిని సన్మానించారు.

## నేటి నుంచి ఆశా వర్కర్ల బస్సు జాతా



కరపత్రాలు, పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): డిమాండ్ల సాధనకు ఆశావర్కర్లు ఆదివారం నుంచి బస్సు జాతా చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ తెలిపారు. సిరిసిల్ల పట్టణం బీవై నగర్‌లోని అమృత్ లాల్ శుక్లా కార్మిక భవన్‌లో శనివారం ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశాన్ని జిల్లా అధ్యక్షురాలు బాదవేని మంజుల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బస్సు జాతా పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లాలో బస్సు జాతా విజయవంతం కోసం చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో రమణ మాట్లాడుతూ ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆశాలకు పని భారం తగ్గించాలని అన్నారు. డిసెంబరు 15 నుంచి 31 వరకు ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో బస్సుజాతా సాగుతుందన్నారు. 18వ తేదీన ఉదయం 10 గంటలకు సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చేరుకుంటుందని, అంబేద్కర్ చౌరస్తాలో సభను ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు భారతి, గాయత్రి, చంద్రకళ, పోచమల్లు, తదితరులు పాల్గొన్నారు

## మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

కథలాపూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పెడుతున్న వంట కార్మికులు తమకు రావాల్సిన డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం కథలాపూర్‌లో నిరసన తెలిపారు. పాఠశాలల్లో నామమాత్రపు కమీషన్‌తో వంటలు చేస్తున్నప్పటికీ తమ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. మూడు మాసాలు గడిచినా డబ్బులు విడుదల చేయకపోవడ వల్ల అప్పుల పాలవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు ప్రభుత్వం స్పందించే దాకా నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని సీఐటీయు జిల్లా కార్యదర్శి చెన్నవేని దశరథం పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.